క్లుప్తంగా

పేర్లు నమోదు చేసుకోవాలి..

సీతంపేట: ప్రతి రైతుకూ ఆధార్‌కార్డు తరహాలో విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందని.. వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య తప్పనిసరన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్సు లేదా వన్‌బీ, ఆధార్‌కార్డు జిరాక్సు, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

బీజేపీ నాయకుల సంబరాలు

భామిని: ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంతో స్థానిక బీజేపీ నాయకులు మండలంలోని బాలేరులో ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తకోట తిరుపతి, కలిశెట్టి శంకర్, బత్తిలి, బిల్లుమడ, చిన్నదిమిలి, సొలికిరి గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల వివాహాలు చేసుకున్న జంటలు ఆలయానికి చేరుకుని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఘటాలను సమర్పించారు. అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు.

లాటరీ వాయిదా

పాలకొండ రూరల్: నియోజకవర్గ పరిధిలో పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన కల్లు గీత కులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు సంబంధించిన లాటరీ వాయిదా పడినట్లు ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో లాటరీ నిలిపివేశామని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ ఉన్నతాధికారుల సూచనలతో తెలియజేస్తామని పేర్కొన్నారు.

'డీ వార్మింగ్' డేను విజయవంతం చేయాలి

సీతానగరం: జాతీయ 'డీ వార్మింగ్' డే కార్యక్రమాన్ని సోమవారం వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఉష, డాక్టర్ పి.పావని కోరారు. ఈ మేర కు మండల కేంద్రంలో వైద్యాధికారులు ఆదివారం మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని పాఠశాలలు అంగన్వాడీ, వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వైద్యసిబ్బంది, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థుల వయస్సును అనుసరించి వేయనున్నామన్నారు. ఈ మేరకు పిల్లల తల్లిదండ్రులు అన్ని పాఠశాలల్లో తమపిల్లలకు నులిపురుగుల నివారణకు ఆల్‌బెన్డ్ జోల్ -400 రకం మాత్రలు వేయించాలని కోరారు.విద్యార్థులు మాత్రలు మింగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అందుకు ప్రజలు ఉపాధ్యాయులకు, వైద్యసిబ్బందికి సహకరించాలని కోరారు.

రెండు కేంద్రాల్లో ఇంటర్ పరీక్షల నిర్వహణకు సిద్ధం

సీతానగరం: మండలంలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, జోగింపేట స్కూల్‌ఆఫ్‌ఎక్స్‌లెన్స్(గిరిజన ప్రతిభా విద్యాలయం)ప్రిన్సిపాల్స్ ఎల్.దాలినాయుడు, ధర్మరాజు అన్నారు. ఈ మేరకు ఆదివారం వేర్వేరు సందర్భాల్లో వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బోర్డు ఉత్తర్వుల మేరకు ఈనెల 17 నుంచి 19 వ తేదీల మధ్య ప్రాక్టికల్స్ నిర్వహించడానికి ల్యాబ్‌లను సిద్ధం చేశామన్నారు. మార్చి 1వ తేదీనుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలియజేశారు. జోగింపేట స్కూల్ ఆఫ్ ఎ క్స్‌లెన్స్, సీతానగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ల్యాబ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు నిర్దేశించిన సమయానికి హాజరు కావలసిఉంటుందని స్పష్టం చేశారు.

తేమ ఉన్న భూముల్లో మిశ్రమ పంటలు మేలు



ఆకు కూరపంట సాగును పరిశీలిస్తున్న రీజనల్ టెక్నికల్ లీడ్ కె.ప్రకాశ్

సీతానగరం: ఖరీఫ్ వరి పంట కోసిన పొలాల్లో తేమ ఉన్న సమయంలో వేసిన రబీపంటలో మిశ్ర మ పంటలు సాగు చేయడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు, భూమిలో కర్బన శాతం పెరిగి భూమి గుల్లబారుతుందని వ్యవసాయశాఖ రీజనల్ టెక్నికల్ లీడ్ కె ప్రకాశ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని గుచ్చిమి పంచాయతీ తాన్న సీతారాంపు రం గ్రామంలో గల డ్రై సోయింగ్(తేమ కలిగి ఉన్న పొలంలో రబీపంట) వేసిన రైతుల పొలాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యపంటలతో పాటు ఇత ర రకాల విత్తనాలు కలిపి వేసుకోవడం వల్ల ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్‌కు కావాల్సిన విత్తనాలు సమకూర్చుకోచ్చునన్నారు. అదేవిధంగా రసాయన ఎరువు రహితంగా వేసిన ముఖ్యపంటతో పాటు ఆకుకూరలు, కూరగాయలు ఈ విధంగా పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ పి. దేవాప్రసాద్, ఎల్టు గంగరాజు పాల్గొన్నారు.

సేవలు నిల్.. ఆర్భాటం ఫుల్..

- రైతుసేవా కేంద్రాలుగా ఆర్‌బీకేల పేరు మార్పు
- అన్నదాతకు అందించిన సేవలు శూన్యం
- గ్రామ స్థాయిలో అలంకారప్రాయంగా ఆర్ఎస్‌కేలు
- మండిపడుతున్న రైతులు



వెలవెలబోతున్న రైతు సేవా కేంద్రం

పాలకొండ రూరల్: మేం అధికారంలోకి వస్తే అన్నదాతలను అందలం ఎక్కించేస్తాం.. రైతును రాజుగా తీర్చిదిద్దుతాం అంటూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక కర్షకులను పూర్తిగా విస్మరించడంతో అన్నదాతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. గ్రామాల్లో రైతుల వద్దకే సేవలు అందించాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతుభరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం రైతుసేవా కేంద్రాలుగా పేరు మార్చింది. అయితే పేరు మార్పులో ఉన్న శ్రద్ధ అన్నదాతలకు సేవ చేయడంలో మాత్రం లేదు. దీంతో సదరు కేంద్రాలు అలంకారప్రాయంగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వివిధ శాఖల ద్వారా ఉద్యానవన, వ్యవసాయ, పాడి అనుబంధ రంగాలకు చెందిన రైతులకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు, రైతు సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు సాగుకు సంబంధించిన ఎన్నో సూచనలు, సలహాలు గత ప్రభుత్వం అందించింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందాల్సిన సేవలు సక్రమంగా అందడం లేదు. ఆ దిశగా ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

మండలం	రైతు సేవా కేంద్రాల సంఖ్య
పాలకొండ	24
వీరఘట్టం	20
భామిని	16
సీతంపేట	29



గతంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన సూచనలు అందిస్తున్న అధికారులు (ఫైల్)

హామీలకు తూట్లు

కూటమి నాయకులు ఎన్నికల సభల్లో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయడం లేదు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏటా రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం ఊసే లేదు. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం నుంచి రైతుకు చిల్లి గవ్వ సహకారం అందలేదు. దీంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. గతంలో జగన్ సర్కార్ పెట్టుబడి సాయంతో పాటు పంట నష్టం జరిగితే పరిహారం అందించేది. పంటలకు ఉచితంగా బీమా కూడా ప్రభుత్వమే చేసింది. కాని ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సంపద సృష్టి పేరిట సంక్షేమ పథకాలకు తూట్లు పెట్టిన కూటమి ప్రభుత్వం ఒక్కో పంటకు ఒక్కో ధర నిర్ణయించి.. ఆ మొత్తం రైతు చెల్లిస్తేనే బీమా పరిహారం అందుతుందని రైతు నెత్తిన భారం మోపింది.

అందని సేవలు..

గతంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు క్షేత్రస్థాయిలో విత్తనాలు, పురుగు మందులు అందించేవారు. ఇప్పుడు కూటమి నేతృత్వంలో ఖరీఫ్, రబీ రెండు సీజన్లో ఎటువంటి పంపిణీలు జరగలేదు. నాడు ఆర్‌బీకేల ద్వారా రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వ్యవసాయ పరికరాలు అందించేది. ఈ యంత్రాలపై కూడా ప్రభుత్వం సబ్సిడీ అందించేది. దీంతో గ్రామాల్లో సాంకేతికత అందుబాటులోకి వచ్చి అత్యధికులు సేద్యం బాట పట్టారు. వ్యవసాయ విస్తీర్ణం పెరగడంతో పాటు అధిగ దిగుబడులు సాధించేవారిమని రైతులు నేటికీ గుర్తు చేసుకుంటున్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ముందుగానే బుక్ చేసుకునేందుకు గాను గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసింది. గతంలో వ్యవసాయం ఒక పండగలా ఉండగా.. నేడు దండగలా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో దిగుబడులు విక్రయించుకోవడానికి ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విత్తనం నుంచి విక్రయం వరకు అక్కరకు వచ్చే రైతుసేవా కేంద్రాలను బలోపేతం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఎన్నో ఇబ్బందులు:



గతంతో పోల్చుకుంటే ఇప్పుడు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ఆర్‌బీకేలను పూర్తిగా నిర్వీర్యం చేసేలా అడుగులు పడుతున్నాయి, అక్కడ అందించే సేవలు నానాటికీ తగ్గిపోతున్నాయి. పెట్టుబడి సాయం పడలేదు. ప్రభుత్వం చొరవ చూపకుంటే సేవా కేంద్రాల్లో అధికారులు మాత్రం ఏమి చేయగలరు. ప్రభుత్వమే దృష్టి సారించాలి.

– వంజరాపు కొండలరావు, రైతు, బుక్కూరు, పాలకొండ మండలం

మద్యంసీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలు ఎక్సైజ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 17 మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కురుపాం ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. జియ్యమ్మవలస మండలంలోని తురకనాయుడువలసకు చెందిన ఓ వ్యక్తి దగ్గర నుంచి 7 మద్యంసీసాలు, కురుపాం గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద నుంచి 10 మద్యంసీసాలు పట్టుకుని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ ఎస్ఐ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

చదువును దూరం చేస్తే ఊరుకోం..

- మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: పేద విద్యార్థులకు చదువును దూరం చేస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వండువలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నీరుగారుస్తోందని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేంద్ర విద్యావిధానానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిందన్నారు. అయితే కూటమి సర్కారు గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను మూసేలా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రతీ రోజు రాష్ట్రంలో ఏదో ఒకచోట వ్యతిరేకిస్తూనే ఉన్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను, తల్లిదండ్రుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్



వీరఘట్టంలో వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా పలు జంక్షన్ల వద్ద ఎస్సై జి.కళాధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన తనిఖీలు చేపట్టి, నిబంధనలు పాటించని వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, అలాగే మద్యం మత్తులో డ్రైవింగ్ చేయకూడదని ఎస్సై సూచించారు.

రహదారి స్థలంలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం



పదమాయవలసలో రహదారి స్థలంలో నిర్మాణానికి సిద్ధమవుతున్న ఆలయం

బలిజిపేట: మండలంలోని పదమాయవలసలో సర్వే నంబర్ 64లో ఉన్న రహదారి స్థలంలో ఆలయం, బస్‌షెల్టర్ నిర్మాణానికి సర్పంచ్ టి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. బలిజిపేట నుంచి పదమాయవలస వెళ్లే మార్గంలో గ్రామం ప్రారంభంలో సర్వే నంబర్ 64లో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉంచాల్సిన అదనపు స్థలం ఉంది. ఆ స్థలంలో బస్‌షెల్టర్, మందిరం నిర్మాణానికి సర్పంచ్ సత్యనారాయణ పంచాయతీ తీర్మానం చేయించారు. నిర్మాణానికి సంబంధించిన చర్యలు చేపడుతున్నారు. దీనిపై అదేగ్రామానికి చెందిన టి.వనజాక్షి బలిజిపేట తహసీల్దార్, పోలీస్ శాఖ వారికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ రహదారి స్థలాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, అదేవిధంగా పక్కనే తన స్థలానికి ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే గతం నుంచి రెవెన్యూ లెక్కల ప్రకారం నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్న స్థలం రహదారిగానే రికార్డుల్లో ఉన్నట్టు దానిని అధికారులు గుర్తించి భవిష్యత్తులో రహదారికి ఇబ్బందులు లేకుండా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. దీనిపై తహసీల్దార్ రత్నకుమారిని వివరణ కోరగా స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎటువంటి పనులు చేపట్టవద్దని సూచించినట్టు చెప్పారు.

గంజాయి మత్తులో మైనర్లు?

సాలూరు: గంజాయి, సారాకు యువత బానిసవుతున్నారు. ఇందులో మైనర్లు కూడా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పండగలు, పుట్టిన రోజు వేడుకలంటూ..విద్యార్థులు, యువత మత్తులో మునిగి తేలుతున్నారు. మరోవైపు రవాణా, విక్రయాల్లోనూ భాగమవుతున్నారు. తక్కువ కాలంలో అధిక డబ్బు సంపాదించే మార్గంగా ఈ అక్రమ వ్యాపారాలను పలువురు ఎన్నుకుంటున్నారు. పోలీసులు ఇటీవల కాలంలో తరచూ గంజాయి, సారా వంటి మత్తు పదార్థాలపై దాడులు చేస్తున్నారు. ఈ క్రమంలో వీటి వెనుక సాలూరు, పరిసర ప్రాంతాల్లో బాలు రు, యువతే ఉండడం గమనార్హం.

సంపాదన మార్గంగా..?

తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపిస్తూ.. పలువురు అక్రమార్కులు, వ్యాపారులు యువతను గంజాయి, సారా రవాణా కు సాలూరు పరిసర ప్రాంతాల్లో వినియోగిస్తున్నా రు. సాలూరు శివారులో కొద్దిరోజుల క్రితం రూరల్ పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సుమారు నాలుగు కిలోల గంజాయితో సాలూరు పట్టణం వైపు వస్తుండగా.. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అందులో ఒకరు పట్టణానికి చెందిన యువకుడు కాగా.. మరొకరు పాచిపెంట మండలానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. ఇందులో ఒకరు మైనర్‌గా సమాచారం. ఈ తరహా ఘటనలు తరచూ జరుగుతున్నాయి. వినియోగం, రవా ణా, విక్రయాల్లో మైనర్లు, యువత ఎక్కువగా దొరుకుతున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

పార్వతీపురంటౌన్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై పాపారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల మృతులలో ఎక్కువమంది మద్యం తాగి వాహనాలు నడిపిన వారే ఉన్నారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు విధిగా బండి పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్ చలానాలు, రవాణాశాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివాటిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రమం తప్పకుండా డ్రంక్‌అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహన తనిఖీలు..

పాలకొండ పట్టణంలోని పలు సెంటర్ల వద్ద స్థానిక పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఏఎస్సై ధర్మారావు ఆధ్వర్యంలో సిబ్బంది వాహన పత్రాలు తనిఖీ చేసి, నిబంధనలు పాటించని వారి నుంచి అపరాధ రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

- పాలకొండ

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న గణిత ఉపాధ్యాయులు

వీరఘట్టం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నోత పాఠశాలలో సిక్కోలు గణిత వేదిక ఆధ్వర్యంలో 6,7 తరగతుల విద్యార్థులకు ఆదివారం మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కిమ్మి పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, నడిమికెల్ల యూపీ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, తెట్టంగి హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు సిక్కోలు గణిత వేదిక అధ్యక్షుడు సూరు సతీష్, ఉపాధ్యాయులు సుధీర్, అశోక్, వాసుదేవరావు, బంకురు అప్పలనాయుడు బహుమతులు అందజేశారు.

పూర్తవ్వని నిర్మాణం చుట్టూ ప్రహరీకి నిధులా?



అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణం చుట్టూ ప్రహరీ కట్టేందుకు ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేయడం చర్చనీయాంశమైంది. నిధులు లేని కారణంగా భవన నిర్మాణం నిలిచిపోతే ప్రహరీ నిర్మాణానికి నిధులు ఏ విధంగా కేటాయిస్తారని సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ప్రస్తుతం శ్లాబ్ దశలో భవన నిర్మాణం ఉందని, తొలుత భవనం పూర్తికి నిధులు ఇస్తే బాగుంటుందన్నారు.

మహాలక్ష్మి పేరంటాల ఉత్సవం ప్రారంభం



మహాలక్ష్మి పేరంటాలకు పూజలు చేస్తున్న ధర్మకర్తలు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగిలో వెలసిన మహాలక్ష్మి పేరంటాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ 48వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నారాయణరావు, జయలక్ష్మి దంపతులు ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 11 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు అన్నవరం, కాగితాపల్లి, తెట్టంగి, వాల్తేరు గ్రామాలకు చెందిన భజన బృందాలు పాల్గొని కీర్తనలు ఆలపించారు.

ఇది చారిత్రాత్మక విజయం

గరుగుబిల్లి: దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం చారిత్రాత్మకమైనదని ఆ పార్టీ మండల నాయకులు పి.వెంకటనాయుడు, పి.అశోక్‌లు అభివర్ణించారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని విలేకరులతో ఆదివారం మాట్లాడారు. బీజేపీతోనే దేశాభివృద్ధి, ప్రజాసంక్షేమమని, 2047 నాటికి దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ ప్రణాళికలు రచిస్తున్నారన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారుపై పూర్తి విశ్వాసం ఢిల్లీ ప్రజలకు ఉండడంతోనే ఢిల్లీలోనూ పార్టీని గెలిపించారన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ చైతన్య ఉత్సవాలు



పూజలు చేస్తున్న ఆనందరావు దంపతులు

భామిని: మండలంలోని పసుకుడిలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభో ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రెండు రోజులు నిర్వహించిన ఉత్సవాల్లో పసుకుడి పాల సొసైటీ చైర్మన్ బెవరా ఆనందరావు దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఒడిశాకు చెందిన భక్తబృందాలు పాల్గొని హరేరామ కీర్తనలు ఆలపించారు. సర్పంచ్ భార్గవనాయుడు సారథ్యంలో వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

వేసవిలో నీటిఎద్దడి నివారణకు చర్యలు



లివిరి కూడలి వద్ద మోటార్‌కు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

భామిని: మండలంలోని లివిరి పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య రాకుండా ఆదివారం ముందస్తు చర్యలు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సూచనల మేరకు సర్పంచ్ బైరి సౌధామిని పర్యవేక్షణలో తాగునీటి వనరులకు మరమ్మతులు చేపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గెల్లంకి రమేష్, బైరి త్రినాథ్‌లు సంయుక్తంగా నీటి ఎద్దడి నివారణ చర్యలు ముమ్మరం చేశారు. ప్రధానంగా ఏబీ రోడ్డు కూడలిలో తాగునీటి ట్యాంక్, మోటార్లకు మరమ్మతులు చేపట్టారు.

నేత్ర శస్త్రచికిత్సకు 81 మంది ఎంపిక



వృద్ధురాలి కంటిని పరిశీలిస్తున్న వైద్యుడు జాక్సన్

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద ఉన్న తిరుమలసాయి హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి హాజరైన 143 మందిలో 81 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి రోగులకు తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, సాయిరేవంత్, క్యాంపు కో-ఆర్డినేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఉద్యోగాల భర్తీ సరికాదు

గుమ్మలక్ష్మీపురం:

ప్రభుత్వ శాఖల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల భర్తీ.. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా చేయాలని రాష్ట్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అవుట్ సోర్సింగ్ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ జేఏసీ అధ్యక్షుడు జి.రమేష్, ఉపాధ్యక్షుడు జి.సంతోష్‌కుమార్, కోశాధికారి ఎ.అనీష్‌కుమార్‌లు ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఉద్యోగ నియామకాలు జరిగితే పారదర్శకత లోపించి, మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. అలాగే ఉద్యోగాల భర్తీలో రాజకీయ ప్రమేయం కూడా ఎక్కువవుతుందన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా సరిగ్గా అమలవ్వదన్నారు. ప్రభుత్వమే నేరుగా ఏపీ కార్పొరేట్ అవుట్ సోర్సింగ్ సంస్థ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

మద్యంషాపుల లాటరీ వాయిదా

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కల్లుగీత కార్మికులకు సంబంధించి మద్యంషాపుల లాటరీ వాయిదా వేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ నెల 10వ తేదీన లాటరీ ప్రక్రియ జరగాల్సి ఉండగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో లాటరీ వాయిదా వేశామని, తదుపరి లాటరీ తీసే తేదీ వెల్లడిస్తామన్నారు.